క్లుప్తంగా

బొందిలిపాలెంలో అభివృద్ధి పనులు

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెంలో రూ.13 లక్షలతో సిమెంట్ డ్రెయిన్ల పనులతో పాటు రెండు కల్వర్టు పనులు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం.ఆకాష్ బుధవారం తెలిపారు. పంచాయతీ, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో గ్రామంలో రహదారి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలిగించి 40 అడుగులు నూతన రహదారి మార్గం అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. గ్రామంలో ప్రధాన వీధిలో నుంచి 550 మీటర్ల మేర రోడ్డు మార్గంలో ఇరువైపులా సిమెంట్ డ్రెయిన్ పనులు చేపట్టినట్లు వివరించారు. పంచాయతీ కార్యాలయ పరిధిలో కల్వర్టు, మరో కల్వర్టు గ్రామంలోకి వెళ్లే మార్గంలోని పనులు చేస్తామన్నారు. అందుకుగాను ఎంపీపీ గ్రాంటు రూ.5లక్షలు, ఎమ్మెల్యే గ్రాంటు రూ.8లక్షలతో అభివృద్ధి పనులు గ్రామస్తులు సహకారంతో చేస్తున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు సర్పంచి బోదాల వీరాంజనేయులు, సచివాలయ ఇంజినీరు బసవరాజు, ఉన్నారు.

నూతన పైపులైన్ల ఏర్పాటుకు పరిశీలన



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని 23వ వార్డులో కౌన్సిలర్లు షేక్ షకీలా, నన్నేసా బుధవారం పర్యటించారు. ఇటీవల నిర్మించిన సిమెంట్ రోడ్డు పనులు పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా గతంలో ఉన్నటు వంటి తాగునీటి పైపులైన్ స్థానంలో నూతన పైపులైన్ పనులు ప్రారంభించనున్నట్లు వారు వివరించారు. వార్డులోని సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి మంచి నీటి కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తాగునీటి కుళాయి వద్ద, ట్యాంకర్ల వద్ద యుద్ధాలు జరిగేవని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చొరవతో ఇబ్బందులను శాశ్వతంగా రూపుమాపడం జరిగిందన్నారు.

రోడ్డు ప్రమాదాలు నియంత్రణకు చర్యలు

శావల్యాపురం: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ గల్లా రవికృష్ణ బుధవారం తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లో ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు జాతీయ రహదారి మార్గంలో మండల కేంద్రం శావల్యాపురంలో జెడ్పీ ఉన్నత పాఠశాల పరిధిలో, కృష్ణాపురం గ్రామ పరిధిలో రోడ్డు ప్రమాదాలు నియంత్రణకు చర్యలు చేపట్టామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ట్రాఫిక్ నియంత్రణ బోర్డులతో పాటు డమ్ములను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. బాలురుకు వాహనాలు ఇవ్వరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి



శావల్యాపురం: రీసర్వే పనులు వేగవంతం చేసేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టినట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు తెలిపారు. బుధవారం మండలంలోని వేల్పూరు గ్రామంలో రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రెవెన్యూ సిబ్బందికి సూచనలు చేశారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని కనమర్లపూడి రెవెన్యూ పరిధిలో నూరుశాతం సర్వే పనులు పూర్తి అయినట్లు చెప్పారు. రీసర్వే పనులు పరిశీలించిన వారిలో మండల డెప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావు, వీఆర్వో శ్రీనివాసరావు, సచివాలయ సర్వేయర్లు జవహర్‌నాయక్, నరసింహసూరి పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు మేలు చేసేలా జగనన్న పాలన

- రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- 36వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 36వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ జనం కష్టాలు తెలిసిన ప్రభుత్వం జగనన్నది అని చెప్పారు. కులం, మతం, పార్టీ, వర్గాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందని తెలిపారు. ఏ కుటుంబమైనా అభివృద్ధి చెందాలంటే భావిపౌరులకు నాణ్యమైన విద్యనందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి జగనన్న ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఇంగ్లిష్ మీడియం, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో పథకాలతో పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారని వివరించారు. ఆరోగ్యశ్రీని దాదాపు అన్ని వ్యాధులకు వర్తింప చేస్తున్నామన్నారు. రూ.16వేల కోట్లతో గ్రామ స్థాయిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం నుంచి మెడికల్ కళాశాలల నిర్మాణం వరకు ఎంతో పకడ్బందీగా చేపడుతున్నామని వివరించారు. ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అందరికీ ఇళ్లు, జగనన్న కాలనీలు నిర్మిస్తోందని పేర్కొన్నారు. జగనన్న కాలనీలతో ప్రతి ఒక్కరి సొంతింటి కల సాకారం ఆవుతుందని వివరించారు. ప్రజా సంక్షేమం కోసం ఎంతో చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తోట రాజేంద్రప్రసాద్, విడదల కమలేంద్ర, రామిశెట్టి శివప్రసాద్, బత్తుల కుమారస్వామి, శ్రీగణేష్, కోయిలమూడి అరుణ, బాషా, సత్యనారాయణ, ఆవుల భాగ్యలక్ష్మి, శీలంశెట్టి కళావతి, తిరుమలశెట్టి సుధారాణి పాల్గొన్నారు.

వృషభరాజముల పోటీలను జయప్రదం చేయండి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- పోటీల పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని డీఎస్ఏ స్టేడియంలో ఈనెల 2 నుంచి 29వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు నిర్వహించనున్న ఒంగోలు జాతి వృషభరాజముల బండలాగుడు బలప్రదర్శన పోటీలకు వేలాదిగా పాల్గొని దిగ్విజయం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి జిల్లా ప్రజలకు పిలుపు ఇచ్చారు. బుధవారం రాత్రి ప్రకాష్‌నగర్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పోటీలను పురస్కరించుకొని నిర్వాహకులు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎనిమిది విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సీనియర్స్ విభాగం మొదటి బహుమతిగా రూ.లక్ష అందజేయనున్నట్లు వివరించారు. మూడేళ్ల నుంచి పోటీలు నిర్వహిస్తూ గతంలో ఉన్న రికార్డులను బద్దలు చేస్తూ సర్టిఫికెట్లను కూడా పొందటం జరిగిందన్నారు. ప్రతి ఏడాది రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 150 నుంచి 200 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతో పాటు వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన రెడ్డి, జిల్లాలోని ఇద్దరు మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, పల్నాడు, గుంటూరు జిల్లాలకు చెందిన శాసనసభ్యులు హాజరవుతారన్నారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తదితరులు

వలస కార్మికులకు దుప్పట్లు పంపిణీ



పిల్లలకు దుప్పట్లు అందిస్తున్న దృశ్యం

నరసరావుపేట ఈస్ట్: పొట్ట చేతబట్టుకొని సుదూర ప్రాంతాల నుంచి జీవనోపాధికై వచ్చిన వలస కార్మికులను స్థానికులు ఆదరించటం అభినందనీయమని స్పెషల్ క్లాస్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ షేక్ జంగ్ మహబూబ్‌సుభాని తెలిపారు. లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం వినుకొండ రోడ్డు పట్టణ శివారులోని వలస కార్మికులు, వారి పిల్లలకు దుప్పట్లు, కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మేజిస్ట్రేట్ జంగ్ మహబూబ్‌సుభానీ మాట్లాడుతూ, వలస కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో లిటిల్ హార్ట్స్ ప్రతినిధి జొన్నలగడ్డ నాగరాజేశ్వరి, శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, శ్రీకల్పవల్లి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు వెలంపల్లి కేశవరావు, ప్రవళిక సత్యం, అన్నా చంద్రమోహన్ పాల్గొన్నారు.

నాదెండ్లలో ప్రారంభమైన డ్రోన్ సర్వే



నాదెండ్లలో డ్రోన్ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమణ

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో బుధవారం జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష కార్యక్రమంలో భాగంగా డ్రోన్ ఫ్లైసర్వే పనులు ప్రారంభమయ్యాయి. రెండో విడతలో భాగంగా ఇటీవల ఐదు గ్రామాల్లో ప్రారంభం కాగా, నాదెండ్ల గ్రామంలో సాంకేతిక కారణాలతో రీసర్వే పనులు ప్రారంభం కాలేదు. బుధవారం తహసీల్దార్ ఏవీ రమణ, మండల సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, వీఆర్వోలతో కలసి ఉత్తరం వైపున నంది కుంట విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి డ్రోన్‌ఫ్లై సర్వే పనులు ప్రారంభించారు. ఈ గ్రామంలో 9932 ఎకరాల సాగు భూమి ఉండగా, 6 వేల మంది రైతులు ఉన్నారు. డ్రోన్ ఫ్లైలో గ్రామంలోని హద్దులు, మ్యాప్ ఆధారంగా రైతుల వివరాలు తీసుకుని ఆతర్వాత క్షేత్రస్థాయిలో సర్వే చేయనున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడి రబ్బాని ఫైల్ ఫోటో

నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పనసతోటకు చెందిన షేక్ రబ్బాని(33) చిలకలూరిపేట పట్టణంలో సెల్ షాప్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి రావిపాడు రోడ్డులోని రెస్టారెంట్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలోని రెడ్డినగర్ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రబ్బానిని స్థానికులు ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న టూటౌన్ ఎస్ఐ షేక్ రహంతుల్లా వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వీధి కుక్కల బెడదతో ప్రజలు బెంబేలు

- పలువురికి గాయాలు
- నెల రోజుల్లో పది లేగదూడలను చంపిన కుక్కలు

నాదెండ్ల: గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పంచాయతీ గణపవరంలో నెల రోజుల వ్యవధిలో పది లేగదూడలపై వీధి కుక్కలు దాడి చేసి చంపి తిన్నాయి. మరికొన్ని లేగదూడలు కుక్కల కాటుతో అనారోగ్యం పాలయ్యాయి. అంతేకాక కుక్కలు కరిచి ఇద్దరు రైతులు ఆస్పత్రి పాలయ్యారు. కొద్దిరోజుల నుంచి వీధుల్లో కుక్కలు గుంపులుగా చేరి గ్రామస్తులను వెంటపడుతు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ద్విచక్ర వాహనాల వెంటపడుతుండటంతో వాహనదారులు బెదిరి కిందపడి గాయాలపాలయ్యారు. పలువురిని కరవటంతో బాధితులు స్థానిక పీహెచ్‌సీలో రేబిస్ వ్యాక్సిన్ డోసులు తీసుకుంటున్నారు. ఇటీవల ఒక గేదె ఈనగా, అప్పుడే పుట్టిన దూడపై కుక్కలు దాడిచేసి చంపాయి. ఇది గమనించిన రైతు వెంటపడటంతో అతనిపై దాడి చేశాయి. ప్రస్తుతం ఆ రైతు కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామాల్లో వీధి కుక్కల బెడదను నియంత్రించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. గణపవరం పంచాయతీ కార్యదర్శి అర్వపల్లి శేఖర్ దృష్టికి గ్రామస్తులు సమస్యను తీసుకెళ్లగా, కుక్కల నియంత్రణకు పంచాయతీలో నిధులు లేవని, అంతేకాక కుక్కలను చంపకుండా, సుదూర ప్రాంతాలకు తరలించాల్సి ఉందన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

దొడ్లేరు(క్రోసూరు): ప్రకృతి వ్యవసాయం డివిజన్ మాస్టర్ ట్రైనీ సైదయ్య ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు రబీ సీజన్‌లో వరిలో ఏఏ పద్ధతులు పాటించాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్బీకే వద్ద నారును బీజామృతంతో శుద్ధిపై అవగాహన కల్పించారు. దీని వలన ప్రధాన పంట తెగుళ్లబారిన పడకుండా ఉంటుందని, కొనలు తుంచి నాటటం వలన కాండం తొలిచే పురుగు, రసం పీల్చే పురుగు గుడ్లను పూర్తిగా నశింప చేయవచ్చునన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశం

కొంపిచర్ల: మండలంలో రామిరెడ్డిపాలెంలో జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యంపై అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జలజీవన్ మిషన్ మండల కో–ఆర్డినేటర్ బాబూరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కుళాయిల ద్వారా సురక్షిత తాగునీటిని అందించడమే లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2024 కల్లా ప్రతి మనిషికి ప్రతిరోజు 55 లీటర్ల తాగునీటిని అందించాలని ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జలజీవన్ మిషన్ ప్రతినిధి నవీన్ కుమార్ పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు



గాయాలపాలైన వెంకటేష్

నాదెండ్ల: ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు గాయాల పాలైన ఘటన జాతీయ రహదారిపై గణపవరం గ్రామ రాజీవ్‌గాంధీకాలనీ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మద్యం తాగిన యువకుడు గుంటూరు నుంచి చిలకలూరిపేటకు రాంగ్‌రూట్‌లో ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో రాజీవ్‌గాంధీకాలనీ వద్ద చౌడవరం వెళ్లేందుకు వెంకటేష్ బస్సు కోసం నిరీక్షిస్తున్నాడు. ఈ క్రమంలో వేగంగా ద్విచక్ర వాహనం ఢీకొనటంతో వెంకటేష్‌కు గాయాలు కాగా, ఢీకొట్టిన యువకుడూ గాయాల పాలయ్యాడు. నేషనల్ హైవే అంబులెన్సులో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

రిపబ్లిక్ డే వేడుకలకు ఇంద్రసేనారెడ్డి



తోటి కళాకారులతో ఇంద్రసేనారెడ్డి

కారెంపూడి: ఢిల్లీలో జనవరి 26న నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకల్లో మన రాష్ట్ర కళాకారులకు కొరియోగ్రాఫర్‌గా పల్నాడు జిల్లా కారెంపూడికి చెందిన నాగిరెడ్డి ఇంద్రసేనారెడ్డి వ్యవహరిస్తున్నారు. లంబాడి డ్యాన్స్, గూసడి డ్యాన్స్‌కు మన రాష్ట్రం నుంచి ఎంపికైన 80 మంది కళాకారుల బృందాలకు ఇంద్రసేనారెడ్డి టీమ్ లీడర్‌గా కొరియోగ్రాఫర్‌గా ఎంపికై ప్రస్తుతం వారిని గైడ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న ప్రీ రిపబ్లిక్ డే ఈవెంట్స్‌లో లంబాడి, గూసడి నృత్య ప్రదర్శనలకు కొరియోగ్రాఫ్ చేస్తున్నారు. గతంలో మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ శాఖ తరఫున జరిగిన ఈవెంట్స్‌లో చురుకుగా పాల్గొని దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రదర్శనలిచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనకు దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనే కళాకారులకు కొరియోగ్రాఫ్ చేసే అవకాశం దక్కింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిలకలూరిపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన బుధవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. ఈ నెల 13వ తేదీ గుంటూరు శారదా కాలనీకి చెందిన అల్లడి దుర్గారావు, సోదరి తిరుపతమ్మ ద్విచక్ర వాహనంపై దొనకొండ బయలుదేరారు. ఈ క్రమంలో మండల పరిధిలోని తాతపూడి గ్రామ సర్వీసు రోడ్డులో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని స్థానికులు కేఎంసీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ విషయంపై బాధితుడి తల్లి అల్లడి ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి



పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

శావల్యాపురం: రబీలో పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు కోరారు. బుధవారం మండలంలోని గుంటుపాలెంలో రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ రబీలో 4300 ఎకరాలు వివిధ రకాల పంటలను రైతులు సాగు చేయగా 3800 ఎకరాలు ఈ–క్రాప్ నమోదు వీఏఏలు చేశారన్నారు. మండలంలోని శానంపూడిలో వరి పంట కోత ప్రయోగాలు చేసినట్లు చెప్పారు. ఎకరంలో 36 సంచులు దిగుబడులు వచ్చినట్లు ఏఓ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ పురేటి అశోకా, వీఏఏలు ఇర్మియా, వరలక్ష్మి, ఆదాం, ప్రసాద్, శివనాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు నకరికల్లు క్రీడాకారులు



నకరికల్లు: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు పోటీలకు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ఎంపికై నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య బుధవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వతేదీన నంబూరులో నిర్వ హించిన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థిని నెమలికంటి శ్రీజ 200మీటర్ల పరుగుపందెంలో మొదటిస్థానం, 400 మీటర్లు, 600 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. పొనాది లేఖ్యసాయితులసి డిస్కస్‌త్రోలో ప్రథమస్థానం సాధించగా, రమావత్ రవితేజనాయక్ హైజంప్‌లో ప్రథమస్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులు శ్రీకాకుళంలో ఈనెల 20,21,22 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడతారన్నారు. ఎంపికైన క్రీడాకారులకు, వారికి శిక్షణనిచ్చిన ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య, క్రీడాఉపాధ్యాయులు షేక్.ఫాతిమా, కె.వెంకటేశ్వర్లులను విద్యాకమిటీ ఛైర్మన్ షేక్.ముప్పాళ్ల మస్తాన్‌వలి, ప్రధానోపాధ్యాయురాలు కె.రంగాదేవిలు అభినందించారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

రాజుపాలెం: మండలంలోని కొండమోడు ఎస్టీ కాలనీ సమీపంలో ఓ బాలికపై యువకుడు లైంగిక దాడికి ప్రయత్నించాడు. మంగళవారం సాయంత్రం బాలిక,తల్లి ఇద్దరు కలిసి ఇంటి వద్ద నుంచి కొండమోడు జంక్షన్‌కు బయలుదేరారు. తల్లి చకచక నడుచుకుంటూ వెళ్తుండగా బాలిక సెల్‌ఫోన్ చూస్తూ వెనుకంజలో ఉంది. ఇదే క్రమంలో అదే గ్రామానికి చెందిన యువకుడు బాలికను వెంటపడి చెయ్యి పట్టుకుని పక్కకు లాగి చీకటి రోడ్డులోకి తీసుకెళ్లి దాడికి ప్రయత్నించగా తల్లి చూసి కేకలు వేయడంతో యువకుడు పరారయ్యాడు. తల్లి వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చి యువకుడిపై ఫిర్యాదు చేసింది. బుధవారం ఉదయం స్థానిక ఎస్ఐ షఫీ, బాలికను విచారించి కేసు నమోదు చేశారు. యువకుడు పరారీలో ఉన్నాడు. పోలీసులు గాలిస్తున్నారు.

9 జనవరి 2023 తేది పబ్లిక్ నోటీసుకు రిప్లై నోటీసు

1) మా క్లయింటు షేక్ రీనా తండ్రి లేటు జబ్బార్ ప్రస్తుతం బరంపేట, నరసరావుపేట అను వారి సంజాయిషీ ప్రకారము ఈ పత్రికా ముఖంగా తెలియజేయునది ఏమనగా –

2) శ్రీ ఆర్.శ్రీనివాసరావు, న్యాయవాది, నరసరావుపేట వారి క్లయింట్లయిన (1) పఠాన్ ఖాజాబాబు S/o అబ్దుల్ వహాబ్ (2) షేక్ మౌలాలి S/o సుభాని తరుపున ది. 09-01-2023వ తేదీ సాక్షి దినపత్రికలో ప్రకటించబడిన కొన్ని విషయాలయినటువంటి మా క్లయింటు శేషించిన క్రయధనం చెల్లించకుండా విక్రయ దస్తావేజు పొందకుండా తప్పించుకుని తిరగటం, మీ క్లయింటు సభ్యపరుల ద్వారా అడిగించటం, ది. 15-4-2021వ తేదీ నోటీసు యిచ్చి విక్రయ అగ్రిమెంటు రద్దు పరచకోవటం మనుగడలో లేని విక్రయ అగ్రిమెంటు ద్వారా రెవిన్యూ మరియు పోలీసు వారిని తప్పుదోవ పట్టించి, షెడ్యూలు దాఖలా ఆస్తిని ఆక్రమించుకొనుటకు ప్రయత్నించటం, మా క్లయింటు సర్వ సంపూర్ణ హక్కుదారని పబ్లిక్‌కి చెప్పుకొనుట మొదలగు విషయాలన్నీ అవాస్తవములు అయి వున్నవి.

3) మా క్లయింటు ది. 12-12-2019తేది మీ క్లయింటుతో షెడ్యూలు దాఖలా ఆస్తిని రూ.87,50,000/-లకు కొనుగోలు చేయుటకు ఖరారుపడి విక్రయ అగ్రిమెంటు రాసుకుంటే రూ.22,50,000/-లను చెల్లించియున్నారు. అయితే షెడ్యూలు దాఖలా ఆస్తి DHFL గుంటూరు వారికి తనఖా పెట్టి లోను తీసుకొని ఉన్నందున, ఒరిజినల్ దస్తావేజులు బ్యాంకువారి వద్ద ఉండి తనఖా బాకీ తీర్చవలసి ఉన్నది. అప్పటికే కొంతమంది షెడ్యూలు దాఖలా ఆస్తిలో అద్దెకు కూడా ఉంటున్నారు. అందువల్ల శేషించిన క్రయధనం చెల్లించుటకు, వారు తనఖా విడిపించుటకు, అద్దెదారులను ఖాళీ చేయించుటకు విక్రయ దస్తావేజు పొందుటకు ది. 27-1-2020 గడువుగా నిర్ణయించుకోవటమైనది. అయితే పైన తెల్పిన షరతులే కాకుండా వారు షెడ్యూలు దాఖలా ఆస్తిని అక్రమ గల్గిన సర్వేయరు గారిచే కొలిపించటం, ఇంటి నెంబరుకు సంబంధించి నరసరావుపేట మున్సిపల్ రికార్డులలో దొర్లిన తప్పును సవరణ చేయించవలసియున్నది.

4) అయితే పైన తెల్పిన ఖాజాబాబు, మౌలాలి తమ వంతు చేయవలసిన విధులను నిర్వహించకుండా ది. 20-03-2021 తమ న్యాయవాది ద్వారా నోటీసులో ది. 26-3-2021వ తేదీ రిజిస్ట్రార్ వారి కార్యాలయంకు వచ్చి శేషించిన క్రయధనం చెల్లించి విక్రయ దస్తావేజులు పొందవలసినదిగా తెలియపర్చియున్నారు. దానికి ది. 24-3-2021 రిప్లై యివ్వటం జరిగింది. వారు తమ వంతు సహకారం అందించకుండా అజ్ఞాతంలో వుండి ఇతరులకు విక్రయించుటకు ప్రయత్నించగా మా క్లయింట్లు మోసగించబడ్డారనే భావనతో నరసరావుపేట 2వ పట్టణ పోలీసు స్టేషన్‌లో క్రైం నెం. 71/2021 నమోదు చేయించటం జరిగింది. దర్మిలా న్యాయవాదిని మార్చుకొని అనేక పర్యాయములు అనవసర నోటీసులు జారీ చేయించటం జరిగింది. స్పందన కార్యక్రమంలో మా క్లయింటు గ్రీవెన్స్ పిటీషన్‌లు దాఖలు చేయటం, మధ్యవర్తులను పంపడం వలన పైన తెల్పిన వారు మా క్లయింట్‌కు రూ. 36,00,000/- (అక్షరాలా ముప్పై ఆరు లక్షల రూపాయలు) పూర్తి పరిష్కారంగా వాపసు యిచ్చుటకు అంగీకరించియున్నారు. అంగీకరించిన పైకం కూడా ఇవ్వకుండా కాలయాపన చేయుచున్నందున జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు తహశీల్దార్ గారు షెడ్యూలు దాఖలా ఆస్తిలో నివాసముండమని ఆదేశించియున్నారు. అందులకు డబ్బు చెల్లించేవరకు షెడ్యూలు దాఖలా ఆస్తిలో ఉండుటకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఖాజాబాబు, మౌలాలి, తహశీల్దార్ గార్కి తెలియపర్చియున్నారు.

5) అయితే వారు రిజిస్ట్రేషన్ చేయకుండా, డబ్బు చెల్లించకుండా ఒక పథకం ప్రకారము తమ ఆర్థిక, రాజకీయ పలుకుబడితో యస్.టి. మరియు యస్.సి కులాలకు చెందిన విద్రోహశక్తులను మా క్లయింటు వారి కుటుంబ సభ్యులపైకి ప్రేరేపించి వారిని భయభ్రాంతులకు గురి చేసి స్టేషన్‌లో అక్రమముగా నిర్బంధించి షెడ్యూలు దాఖలా ఆస్తిలో నుండి బయటకు వెళ్లేటట్లు చేశారు. ప్రస్తుతం మా క్లయింట్లకు చెందిన సామాగ్రి కూడా షెడ్యూలు దాఖలా యింట్లోనే ఉన్నది. యిప్పుడు ఇతరులకు విక్రయించు దురుద్దేశ్యంతో పత్రికా ప్రకటన యివ్వబడినది.

6) కనుక ఈ పత్రికా ముఖంగా తెలియపర్చునది ఏమనగా షెడ్యూలు దాఖలా ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరిపినను అవి మా క్లయింటునుబద్ధుని చేయవని మరియు మేము తీసుకోబోయే సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని తెలియపర్చనమైనది.

షెడ్యూలు

నరసరావుపేట మున్సిపల్ పాతవార్డు 1, కొత్తవార్డు 1, ప్రస్తుతవార్డు 34, పాత సర్వే డి.నెం. 125/ఎ1రు యం.1.38కట్లులోని, టి.యస్.నెం. 121రు, బ్లాక్ నెం. 1/1, రుగా గల ఆవరణ స్థలము, మేడ ఇంటికి హద్దులు.తూర్పు : సత్తెనపల్లి రోడ్డు హద్దు ఇ. 16.6అం.లు.,
దక్షిణం : మహమ్మద్ ఆఫీస్ గారి కుమారుల తాలూకు ఇల్లు హద్దు– జాయింటుగోడ హద్దు – అ.80.0లు. పడమర : గల్లీ బజారు హద్దు అ. 16.6అం.లు. ఉత్తరం : షేక్ సైదా తాలూకు స్థలం హద్దు అ. 80.0లు

ఈ నాలుగు హద్దుల మధ్య గల 146.66 చ.గ.లకు సరియగు 122.62 చ.మీ.ల స్థలమున్నూ, ఇందులో ఇప్పటికి సుమారు 28 సం॥ల క్రిందట గ్రౌండ్ ఫ్లోరులో 1000 చ॥అ॥లలో కట్టియున్న ఆర్.సి.సి.యున్నూ, సదరు గ్రౌండు ఫ్లోరుపై ఫస్టు ఫ్లోరులో 1000 చ.అ.లలో కట్టబడి చేసిన ఆర్.సి.సి. మేడ ఇల్లున్నూ, సదరు ఫస్టు ఫ్లోరుపై సెకండ్ ఫ్లోరులో 1000చ.అ.లలో కట్టబడిన ఆర్.సి.సి. మేడ ఇల్లున్నూ, అందలి యావదాస్తియైన కప్పు, కలప సామాన్లు, తలుపులు దర్వాజాలు, షటర్లున్నూ నెం. 4872రుగా గల కరెంటు మీటరున్నూ, కరెంటు మీటరు డిపాజిట్టున్నూ, మునిసిపల్ నీటి కుళాయున్నూ సదరు కుళాయి డిపాజిట్టున్నూ, సదరు కుళాయికి బిగించియున్న మోటారున్నూ.
తేది. 18-01-2023, నరసరావుపేట.

సాంబశివరావు కొండా | ఆనంద్‌కుమార్ కె. | సుబ్బారావు యం.
అడ్వకేట్స్, నరసరావుపేట.